# తెగింది తీగ!

విశ్వానికి ఆ ఉద్యోగం నచ్చింది. ఆ గేటు చూడగానే 'చాల అదృష్టవంతుణ్ణి' అని తనని తాను అభినందించుకొన్నాడు. ఇక తన బ్రతుకు ఏకరీతిగా, దివ్యంగా వెలిగిపోతుందనుకొన్నాడు. జీవితమనే రస్తాలో చాల ఉత్తమమైన చోట మలుపు తిరిగిందనుకొన్నాడు. 'స్టార్ తిరిగిపోయింది మరి' అని మురిసిపోయాడు. గేటు ఇరువేపులా మందారచెట్లు నవనవలాడుతూ ఎఱ్ఱగా వెలుగులీనుతున్న పూలతో స్వాగతం చెప్పాయి. రిక్షామనిషి బెడ్డూ అదీ తెస్తూవుంటే, ఠీవిగా నడిచాడు లోపలికి. ఇంజన్లు 'మోతగా' పనిచేస్తున్నాయి. ఎడంచేతిప్రక్క కొబ్బరికీతులతో వేసిన పొడవైన గుడిసె లోంచి నడుముకు తుండుగుడ్డ చుట్టుకొని అప్పుడే స్నానానికి వెళ్తున్న కళ్ళద్దాలమనిషి ఒకరు విశ్వాన్ని తీక్ష దృక్కులతో హడలెత్తించాడు. 'ఇట్లా బెదిరింపులకు బెదిరే రకం కాన్లే' అనుకొని, ఒకసారి కళ్ళు మూసుకొని, తెరచి, ఆ చూపుల్ని తప్పించుకొన్నాడు. ఈసారి ఆమనిషి బక్కపలుచని దేహంలో ఎముకలగూడు కనిపించి జాలిపడ్డాడు.

"ఎవరు నువ్వు. ఏం పనిమీద వచ్చావు" అన్నాడా మనిషి. ఏకవచన ప్రయోగం చేసినందుకు కోపమొచ్చింది. కోపాన్ని అణచుకొనే ప్రయత్నం చేయలేదు.

"ఎవరైందీ...తర్వాత తెలుస్తుందిలెండి. మీా మేనే జరుగా రున్నారా లోపల," అంటూ అతని జవాబుకోసం చూడకుండా, ఆఫీసులోపలికి నడిచాడు. రిక్షామనిషికి డబ్బు లిచ్చి పంపించేశాడు.

ఆఫీసులో ఎవరూ కనిపించలేదు. ఒక పెద్ద టేబిలుకు ఒక ప్రక్క చిన్న ఐరన్ సేఫ్ బిగించబడివుంది. మరొకప్రక్క టెలిఫోన్ అమర్చబడివుంది. టేబిలు వెనకగా గోడకు ఎలక్ట్రిక్ బెల్ స్విచ్ వుంది. టేబిలుమీాద కాలింగ్ బెల్, ఇంక్ స్టాండ్, బ్లాటర్...వగైరా వుండి, ఆ సీటు హుందాగా వుంది. ఇదే నన్నమాట తను ఆక్రమించబోయే సీటని విశ్వం ఆనందిం చాడు.

ఫ్యాక్టరీ మిషన్ పనిచేస్తున్న వేపున్న ద్వారంగుండా ఒక నల్లటి పొట్టిమనిషి ఆలాచూస్తూ లోపలికొచ్చాడు. అతనిబట్టలు పూర్తిగా మాసిపోయి, నూనెమరకలతో పరమ ఛండాలంగా వున్నాయి. క్రింద డ్రాయరు, పైన బనియను... అతని వేషం. గడ్డంమాత్రం నీట్‌గా షేవ్ చేసినట్లున్నాడు. అతని ముఖంలో ఏదో క్రూరత్వం వంటిది స్పష్టంగా తెలు స్తోంది. 'అతను డ్రైవరయి వుంటా' డనుకొన్నాడు విశ్వం.

"సింగు యార్ సార్...ఉక్కోరుంగో... మానేజరు వర్రారు," అన్నాడతను.

"మీా మేనేజరు ఎక్కడున్నారు," అన్నాడు విశ్వం.

"ఓహో... తెలుగా...కూర్చోండిసార్. ఆయనే సార్ మేనేజరు," అని దూరంగా, నీళ్ళతొట్టెదగ్గరకు వెళ్తున్న కళ్ళ ద్దాల మనిషిని చూపించాడతను.

'చచ్చా' మనుకొని ఓ కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో లోపలినుంచి ఒక వికృతమైన శబ్దం వినిపించింది. డ్రైవరు హడావిడిగా పరుగుతీశాడు. తనూ లోపలికి వెళ్ళాడు. అమోనియా గ్యాస్ వాసన మత్తెక్కించింది. ఐస్ ప్లాంట్ చాల మురికిగా, నానా గలీజుగా కనిపించింది. "ఇదంతా చాలా శుభ్రంగా వుంచాలి" అనుకొన్నాడు విశ్వం.

డ్రైవరు ఏవో నట్లుబిగించాడు. ఆ శబ్దం పోయింది.

తర్వాత యిద్దరూ ఆఫీసులోకి వచ్చారు.

"మీరు ఎవరో తెలుసుకోవచ్చా సార్" అన్నాడతను.

"నేనూ...ఈ ఫ్యాక్టరీ మేనేజర్ పని తీసుకోవడానికి వచ్చాను. ఒక నెలరోజులు, ఈ పాత మేనేజరుదగ్గర పనంతా నేర్చుకోవాలి" అన్నాడు.

"పాపం" అని సానుభూతి వ్యక్తపరిచా డతను.

పాపమేమిటి ? తను హాయిగా, దర్జా అయిన ఉద్యోగంలో ప్రవేశిస్తుంటేను అనుకొని—

"ఏం ? ఎందుకనీ" అన్నాడు.

"అంతా మీకే తెలుస్తుందిలెండిసార్. ఈ మేనేజరు ఈ ఫ్యాక్టరీని సగం తినేశాడిప్పటికి. ఈ మిషను సరిగా పని చేయదు. సరిగా జీతాలివ్వడు. పైగా దర్బారు జాస్తి, ఇక్కడ నానా యాతనాపడాలి" అన్నాడతను.

"మీది ఏవూరసలు ?" అంటే.

"నెల్లూరుసార్. తెలుగువాణ్ణే" అన్నాడతను. విశ్వానికి సంతోషం కలిగింది.

"మద్రాసులో ఇలాంటి ఐస్‌ఫ్యాక్టరీలుఎన్ని వున్నాయి? దీనికన్న పెద్దవి వున్నాయా?" అని అడిగాడు.

"చాలా వున్నాయిసార్! అన్నిటికన్న యిదే చిన్నది. దీనికి కోల్ స్టోరేజిలేదు. ఒకరోజు మిషన్ పనిచేయక ఐస్ తయారు కాకపోతే, బిజినెస్ అంతా చెడిపోతుంది. కంట్రాక్టులు పోతాయి. రెండువేల రూపాయలుపెట్టి రిపేర్లన్నీ చేస్తే బాగుంటుంది," అన్నాడతను.

తన మేనేజిమెంటులో ఇవన్నీ బాగుపడతాయని విశ్వం విశ్వసించాడు.

అతనే మళ్ళీ అన్నాడు :—

"ఈ మేనేజర్ను కావాలని పంపించేస్తున్నారు సార్. ఈయన ఈ ఫ్యాక్టరీడబ్బు చాలా తినేశాడు. అమ్మే ఐస్‌కు బిల్లురాయడు. రాసినా పౌండు అణా కమ్మితే అర్ధణాకు అమ్మినట్లు రాస్తాడు. మాకు బత్తా రోజుకు ఆరణాలిచ్చి తొమ్మిదణాలకు లెక్క చూపిస్తున్నాడు. డైరెక్టరుగారికి చెప్తే మా ఉద్యోగం వూడుతుందని ఇన్నాళ్ళూ వూరుకున్నాము. ఆఖరుకు సెక్రటరీగారు అన్నీ తెలుసుకొని డైరెక్టరుగారికి చెప్పేసినారు. దానితో స్వంత మనిషిని ఒకరిని ఇక్కడ వేయాలని, మిమ్మల్ని వేసినట్లున్నారు. డైరెక్టరు మీకు బంధువాసార్" అనడిగాడతను.

ఈ డ్రైవరుకు ఇన్ని వివరాలు ఎలా తెలిశాయి? ఇంత ఫ్రీగా ఎలా మాట్లాడగలుగుతున్నాడు? తను మేనేజరయిన

తర్వాత, ఇతణ్ని ఎలా కంట్రోల్ చేయాలి, అని ఆలోచిస్తూ.

"అవును" అనేసి, లేచి టెలిఫోన్ డైరెక్టరీ తీసుకుని కూర్చున్నాడు.

మేనేజరు వచ్చాడు. తను హెడ్డాఫీసునుంచి తెచ్చిన ఉత్తరాన్ని అతనికి అందజేశాడు విశ్వం.

ఆ కవరులోని ఉత్తరం చూసి, అతని ముఖం ఇంకా నల్లగా, వికృతంగా మారిపోయింది. పెద్ద లోతైన కళ్ళతో తీవ్రంగా చూశాడు విశ్వాన్ని. అటువంటి క్రూర జంతు లక్షణాలున్న చూపుల్ని విశ్వం ఎరగడు. ఈ చూపులతన్ని సారి నిజంగా హడలెత్తించాయి.

"సరే ఉండండి...కాఫీ తీసుకున్నారా" అని అడిగాడు.

"ఇంకాలేదు. ముందు స్నానం చేయాలి" అన్నాడు విశ్వం.

"వేన్నీళ్లు వీలుండదు. వెనక వాటర్ టాంక్ వుంది. అక్కడకు వెళ్ళి తొట్టెలోనే హాయిగా చన్నీళ్ళస్నానం చెయ్యొచ్చు" అని—

"ఏయ్ అమీర్" అని కేక వేశాడు.

పొట్టిగావున్న ఒక పదహారేళ్ళతను వచ్చి "ఎన్నా సాక్ ?" అన్నాడు.

"ఇందాళు...నంబపుదు రైటర్—వీడు టాంక్ బోయండీ ఏంకావాలో వీడికి చెప్పండి తెచ్చిపెడతాడు" అని అతను కూర్చుని ఏదో లెక్క రాసుకోవటంలో నిమగ్నుడయ్యాడు.

విశ్వం స్నానంచేసి అబ్బాయిని టిఫిను, కాఫీ తీసుకు రమ్మని పుచ్చుకొన్నాడు.

మేనేజరు పేరు రామకృష్ణయ్య అని తెలుసుకొన్నాడు.

రామకృష్ణయ్య ఒక లెక్కపుస్తకం యిచ్చి అన్ని పేజీలలోనూ కూడిపెట్టమన్నాడు. కూడుతూ, ఏయే రకాల ఖర్చులు చేయబడినాయో, ఏవేవి అక్రమమైన ఖర్చులో, ఏ ఖర్చులు తగ్గించవచ్చునో జాగ్రత్తగా ఆలోచించాడు.

సాయంకాలం చేపలవాళ్లు ఐస్‌కోసం వచ్చారు. చేపల కంపు గుప్‌మని విశ్వం కళ్ళుతిరిగి, తలనొప్పి వచ్చేసింది.

కొన్నిరోజులు గడిచాయి. దాదాపు నలభై వేల రూపాయలు పెట్టుబడితో నెలకొల్పబడిన ఆ ఫ్యాక్టరీ నేటి దుస్థితి విశ్వానికి పూర్తిగా అవగాహనమైంది. ఆ ఫ్యాక్టరీ సరిగా నిర్వహింపబడటంలేదు. పనివారికి సరియైన వేతనాలు యివ్వక పోవడంచేత, వాళ్ళు సరిగా పనిచేయడంలేదు. సైకిల్ బాయ్స్, టాంక్ బాయ్స్ దొంగతనంగా ఐస్ అమ్మేస్తున్నారు. పార్శిళ్లలో నలభై పౌండ్లకు బదులు అరవై పౌండ్ల ఐస్ పెట్టి కట్టేసి, తర్వాత చాటుగా డబ్బు వసూలు చేసుకొంటున్నారు. రంపపుపొట్టు మాయం చేస్తున్నారు. రామకృష్ణయ్య విశ్వం వచ్చిన తర్వాత తప్పులెక్కలు రాయడం తగ్గించేశాడు. అతనికి సిటీలోని ఐస్‌డిపో వాళ్ళతో లాలూచీ వ్యవహారాలున్నట్లుకూడా విశ్వం పసికట్టాడు. అందుకని ఈ విషయం డైరెక్టరుకు రాశాడు విశ్వం. ఇకమీదట డిపోలకు (ఫ్యాక్టరీకి అవి శాఖల వంటివి) డబ్బు వసూలు చేయడానికి, వగైరాలకు విశ్వమే వెళ్ళవచ్చునని కేంద్ర కార్యాలయం

నుంచి ఉత్తరువు జారీచేశారు. రామకృష్ణయ్య కళ్ళలో నిప్పులు చెరిగినట్లు బాధపడినాడు. ఇక తను వీలయినంత త్వరగా దక్కిన దానితో జారుకోవడం ఉత్తమమని అతను నిర్ణయించు కొన్నాడు.

నెలరోజులు గడిచాయి. విశ్వానికి యాభై రూపాయి లిచ్చి రసీదు తీసుకొన్నాడు రామకృష్ణయ్య. మొదటి నెల ఖర్చులకు మాత్రమే ఇవ్వమన్నారని, రెండో నెల తర్వాత జీతం నిర్ణయిస్తారనీ చెప్పాడతను.

రెండో నెల మధ్యలో హెడ్డాఫీసు కార్యదర్శి వచ్చాడు. రామకృష్ణయ్య లెక్కపుస్తకాలూ వగైరా అప్పచెప్పేసి, వెళ్ళిపోయాడు.

విశ్వం తను గమనించిన విషయాలన్నీ కార్యదర్శికి నివేదించాడు. అతని బుద్ధికుశలతకు చుఱుకుదనానికి కార్యదర్శి సంతసించాడు. విశ్వం జీతం వీలయినంత ఎక్కువగా నిర్ణయించబడేటట్లు చూస్తానని మాటయిచ్చాడు. ఉద్యోగాన్ని ఎలా నిర్వహించుకోవాలో, పనివాళ్ళను ఎలా అదుపులో పెట్టుకోవాలో కొన్ని సూచనలిచ్చి ఆయన వెళ్ళిపోయాడు.

ఫ్యాక్టరీ నిర్వహణ పూర్తిగా విశ్వంమీద పడింది. అతను స్వతంత్రించి, వ్యాపారం అభివృద్ధికి కృషిచేశాడు. అనేక కంపెనీలతో, హోటళ్ళ వారితో ఫోన్ ద్వారానూ, స్వయంగా వెళ్ళి కలుసుకొని సంప్రదించి అమ్మకం రెండు రెట్లు ఎక్కువ చేశాడు, ఫ్యాక్టరీ పరిసరాలు శుభ్రంచేయించి. చుట్టూ ఎన్నో పూలమొక్కలు వగైరా వేశాడు. ఎన్నో మాసాలుగా కట్టవలసివున్న కార్పొరేషన్ టాక్స్ కట్టేశాడు.

ఫ్యాక్టరీకోసం ఇదివరకు వున్న కంపెనీలలో చేసిన చిన్న చిన్న అప్పులన్నీ, రోజువారీ అమ్మకంనుంచి మిగిల్ని తీర్చే శాడు. ఇదివరకు అవన్నీ, హెడ్డాఫీసు డబ్బునుంచే తీర్చ బడేవి.

ఫ్యాక్టరీ చిన్నది గనక, ఇదివరలో వ్యాపారం తక్కువ గనక, వేరేగుమస్తా లేడు. మేనేజిమెంట్ చూసుకొంటూ, లెక్కలన్నీకూడా తనే రాసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం మూడుగంటలకు లేచి బండివాళ్ళను లేపి, పార్సెల్స్ పోయేలా చూడాలి. ఆ బండి వాళ్ళను చూసినప్పుడల్లా విశ్వానికి ఆవే దన కలిగేది. ఆ బండివాళ్ళు ముసలివాళ్ళు. శక్తిలేని వాళ్ళు. వాళ్ళు ఒక చిన్న బండిలో దాదాపు వెయ్యి పౌండ్ల ఐస్ వేసుకొని, రోజూ ఇరవై మైళ్ళు లాగుకొనివెళ్ళి, అక్కడ కాంట్రాక్టుదార్లకు అప్పజెప్పి సాయంకాలంలోగా తిరిగి రావాలి. వాళ్ళ జీతం నెలకు ఇరవైఐదు రూపాయలు మాత్రమే. ఇదిగాక నూరు పౌండ్లకు అణా చొప్పున దారిలో టీ వగైరాలకు దినబత్తెం యిస్తారు. అందులో ఒకతని భార్య, ఆ దినంబత్తెం ఉదయమే లాక్కుంటుందనీ, అతను రోజంతా కాళీ పొట్టతో బండి లాగాల్సిందేనని తెలిసి విశ్వం రోజుకు రెండణాలు బత్తా అదనంగా యివ్వడం ప్రారభించాడు.

ప్రతిరోజూ లెక్కలన్నీ రాసి, డబ్బు లెక్కచూసు కొని మర్నాడు ఉదయానికి పంపవలసిన పార్శిళ్ల గురించి కంపె నీల వారికి ఫోనుచేసి తెలుసుకొని, అన్నీ సర్ది పడుకొనేసరికి రాత్రి పన్నెండు గంటలవుతుంది. ఆ ఫ్యాక్టరీలోనే పడు

కోవాలి. ఇంజనుమోతలో నిద్రరాదు. ఆ మూడు గంటల సేపైనా సరియైన విశ్రాంతిలేక, విశ్వం ఆరోగ్యం చెడింది.

విశ్వానికి హోటల్ భోజనం పడలేదు. దూరంగావున్న మంచి హోటలుకు వెళ్ళడానికి మధ్యాహ్నంగానీ, రాత్రిగానీ వ్యవధి వుండదు.

మూడో మాసంలో కూడా అతని జీతం గురించిన ఉత్తరువు అందలేదు. విశ్వం డైరెక్టరుకి ఉత్తరం రాశాడు.

కార్యదర్శి మరోసారివచ్చి పదిరోజులున్నాడు. ఆయన అన్నాళ్ళుండి ఏంచేశాడో విశ్వానికి తెలియదు. ఆయనకు రోజుకు పది రూపాయలు మదరాసులో వున్నన్నాళ్లూ దిన బత్యం ముట్టుతుంది. ఫ్యాక్టరీకి ఎందుకు లాభం రావడంలేదో విశ్వం బోధపరచుకొన్నాడు. లాభం రాకపోయినప్పటికీ, ఇంకా రకరకాల వ్యాపారాలున్న ఆ కంపెనీవాళ్ళు మద్రాసులో ఈ చిన్న ఫ్యాక్టరీని నడపడం ఎందుకోకూడా అతనికి బోధపడింది. ఫ్యాక్టరీపనిమీద డైరక్టరు, సెక్రటరీ మొదలైన వారు మద్రాసువచ్చి జల్సాచేసుకుంటారు. ఈ కంపెనీకి పెట్టుబడిపెట్టిన లక్షాధికార్ల డబ్బు ఆ విధంగానన్నా కదుగుతున్నందుకు విశ్వం సంతోషించాడు.

విశ్వం ఫ్యాక్టరీని శుభ్రంగా వుంచుతున్నందుకు, పని వాళ్ళను దాదాపు ఇరవైమందిని "పసివాడైనా" కంట్రోల్ చేసి బాగా పనిచేయించినందుకు, అమ్మకం రెండురెట్లు ఎక్కువ చేసినందుకూ, ఖర్చులు తగ్గించి అమ్మకంనుంచి డబ్బు మిగిల్చి కంప్రెషన్ పంపును రిపేరు చేయించినందుకు, డిపోవాళ్ళ మోసాల్ని, పనివాళ్ళలో అక్రమాలను అరికట్టినందుకూ,

అప్పులు తీర్చినందుకు, ఫ్యాక్టరీకి అద్దెబండి మానిపించి, స్వంతంగా ఒక బండికొనే ఏర్పాటు చేసినందుకూ కార్యదర్శి విశ్వాన్ని అభినందించాడు. విశ్వం మిక్కిలి సంతోషించాడు.

ఆ మరునాడు కార్యదర్శి చావు కబురు చల్లగా అంద జేశాడు.

"నువ్వు స్వంతమనిషివి- అని డైరెక్టరు గారన్నారు. నీ జీతాన్ని ఇప్పట్లోనిర్ణయించ నవసరం లేదన్నారు. మరికొంత కాలం నీ ఖర్చుల నిమిత్తం ఏభైరూపాయలవరకు తీసుకో వచ్చు" అన్నాడాయన.

విశ్వం ఉత్సాహం చల్లారిపోయింది. తనను తన నిజా యితీనీ, తన శక్తినీ వీళ్ళు ఎలా 'ఖరీదు చేసుకొని' 'లాభం' అనే విలువలోకి మార్చుకొంటున్నారో విశ్వానికి బోధ పడింది. ఈసారి డైరెక్టరు వచ్చినప్పుడు తనే జీతం విషయం అడిగి తెలుసుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

కార్యదర్శి తన ప్రవర్తనగురించి, డ్రైవరుతో రహ స్యంగా మాట్లాడడం విశ్వం గమనించి కుపితుడై పోయాడు.

కార్యదర్శి వెళ్ళిపోయిన పదిహేను రోజులకు డైరెక్టరు గారు స్వయంగా దిగారు ఫ్యాక్టరీని తనిఖీ చేసే నిమిత్తం.

ఇందుకోసం పదిహేనురోజులు ఆయన మద్రాసు క్యాంపు వేసుకొన్నారు. కానీ ఆయన ఫ్యాక్టరీకి వచ్చి వున్న దల్లా పదిహేను నిముషాలు మాత్రమే.

ఆయన దిగిన మరుక్షణం విశ్వం మీద విరుచుకు పడి పోయాడు.

"నీ ప్రవర్తన ఏమీ బాగులేదని తెలిసింది. అప్పు డప్పుడు ఫ్యాక్టరీ వదిలి పోతున్నావట. నువ్వు వెళ్ళిపోతే ఇక్కడ అమ్మకం వగైరా ఏమవుతాయి?" అన్నాడు.

విశ్వానికి ఆశ్చర్యం కలిగింది.

"నేను మీరనుకొన్నంత బాధ్యతా రహితంగా వెళ్ళి పోవడంలేదు. విశ్రాంతిలేక నా ఆరోగ్యం చెడింది. వారానికో రోజు, ఆదివారమన్నా శెలవులేదు. రాత్రి పగలూ పని. నా ఆరోగ్యం చెడింది. తరచు జ్వరం వస్తోంది. అందుకని ఇక్కడే దగ్గరే వున్న డాక్టరు దగ్గరకు రోజూ సైకిలుమీద వెళ్ళి మందు తెచ్చుకొంటున్నాను" అన్నాడు.

"మందుకు నువ్వే ఎందుకు వెళ్ళాలి. జవాన్ని పంపించ రాదా?" అన్నాడాయన.

"మనిషిని చూడకుండా డాక్టరు మందివ్వరు."

"అదిసరే_మొన్న ఈవూళ్ళో ఉన్న వెంకటరత్నం అనే ఆయన్ని ఎందుకు కలుసుకొన్నావు. ఆయన ఎన్నికలలో నాకు వ్యతిరేకంగా పనిచేశాడు."

"కావచ్చు. కానీ ఆయన నాకు చిన్నప్పుడు మేష్టారు. ఆయనదగ్గర ఒక పుస్తకం తెచ్చుకోవాలని వెళ్ళానండీ" అన్నాడు విశ్వం. ఇదివరకెప్పుడు తనాయన్ని అండీ అనలేదు. 'పెదనాయనా!' అనేవాడు. ఆయన అధికారి! తను ఆయన క్రింది ఉద్యోగి అనుకొన్నాడు విశ్వం.

"ఎదురు తిరగడం నేర్చుకొన్నావన్న మాట. ఇంట్లో వూరికే వున్నావని రమ్మన్నాను; కానీ యిలా అవుతావనుకో

లేదు. సరిగ్గా పనిచేస్తూ వున్నావని సంతోషిస్తూ మంచి జీతం కూడా ఏర్పాటు చేద్దామనుకుంటూవుంటే, నువ్వు నా శత్రువులతో స్నేహం చేస్తున్నావు. ఇక ఇలాచేస్తే నీతో నాకాట్టే అవసరం వుండదు. మీ మామయ్యనుచూసి ఇన్నాళ్ళూ వూరుకొన్నాను" అన్నాడాయన.

విశ్వాన్ని కోపము, ఆవేదన కలిచివేస్తున్నాయి. కార్యదర్శి 'కులతత్వవాద' వ్యాధి పీడితుడు. తనపట్ల ఈర్ష్యతో తన స్థానంలో మరొక తన కులంవాడిని (ఈ విషయాలు మాటలు మోసే డ్రైవరే తనతో చెప్పాడు) వేయించాలనే కుట్రతో, తనమీద చాడీలు చెప్పాడని విశ్వం ఊహించుకొన్నాడు.

"మీకు ఇష్టం లేకపోతే తక్షణం వెళ్ళిపోతే పోతాను. మా నాన్నకు ఏవో ఆశలు చూపించి నన్నేదో ఉద్ధరిస్తానంటే వచ్చాను. ఈ జీతం నాకు చాలదు. ఇప్పటికే వందరూపాయలు ఇంటినుంచి తెప్పించుకొన్నాను. ఇంక అలా తెప్పించుకో దలచలేదు. నా శక్తినంతా ఈ ఫ్యాక్టరీ కోసం ధారపోస్తున్నాను. నాకు వెంటనే జీతం నిర్ణయించండి" అన్నాడు విశ్వం.

ఆయన ఆశ్చర్యంతో విశ్వాన్ని చూశాడు. కాస్త బెదిరిస్తే దారిలోకొస్తాడనుకుంటే, ఇలా మాటాడుతున్నాడే అనుకొన్నాడు.

"నువ్వింకా చాలా చిన్నవాడివి. ఉద్రేకం కూడదు. అసలు ఇంతకన్న యెక్కువ జీతాన్ని ఏం చేసుకొంటావు? మొన్న మీ వూరు వెళ్లినప్పుడు మీ నాన్నగారితో మాట్లా

డాను. వాళ్ళనడక్కుండా, నీ ఖర్చులు నువ్వు చూసుకొంటే చాలని చెప్పారు. ఇంతకన్న ఎక్కువ జీతమిస్తే యీ మద్రాసులో చెడిపోతావు. ఈ పట్నంలో ఎన్నివందలైనా దుబారా చేయొచ్చు. అన్యాయంగా పాడయిపోతావని నా భయం" అన్నాడు డైరక్టరుగారు.

"మీ కాభయం అక్కర్లేదు లెండి. ఇంత పెద్ద బాధ్యతల్ని, బరువు నా మీద వేసేప్పుడు మీకు నేను చిన్నవాడుగా కనిపించలేదు. జీతం ఎక్కు వివ్వాలంటే మాత్రం 'పసివాడనైపోయాను. మా నాన్న అలా అని వుండొచ్చు కానీ నాకు సరయిన తిండి బట్టకయినా డబ్బవసరంలేదా! అదీగాక ప్రతి నెలా కొంతడబ్బు నేను మా అమ్మకు పంపాలనుకున్నాను. మీరు ఈ కంపెనీ డబ్బు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నప్పుడు (దుర్వినియోగం చేస్తున్నప్పుడు) నెలకు వంద రూపాయలైనా తీసుకోడానికి నాకు అర్హత లేదా? ఈ ఫ్యాక్టరీ ఆదాయం ఎక్కువ చేశాకనే నేను యిలా అడుగుతున్నాను" అన్నాడు విశ్వం.

"లాభంలేదు. నువ్వు పూర్తిగా చెడిపోయావు" అన్నాడాయన.

ఇంతలో టాంక్ బోయ్ క్రిష్టులు, గాసులో ఐస్ ముక్కలు వేసి తీసుకొచ్చాడు. సీసా తీసి గ్లాసులో పోసి ఇద్దరికి యిచ్చాడు.

"బయట కారులో ఒక గ్లాసు యివ్వు" అన్నాడు డైరెక్టరు.

విశ్వం తన గ్లాసు యిచ్చేద్దామని కారుదగ్గరకు తీసు కెళ్ళాడు. "కారులో ఫ్రంటు సీటులో ఒక అందమైన అమ్మాయి!

ఆమెకు గ్లాసు అందించాడు విశ్వం.

ఆమె పుచ్చుకొని వాసన చూసి గ్లాసును రోడ్డు మీాదికి విసిరికొట్టి చురుగ్గా చూసింది.

మాడిపోయాడు విశ్వం. ఎంత అవమానం. ఈముసలి వాడి ప్రియురాళ్ళ దగ్గరకూడా అవమాన పడాలా! అను కొన్నాడు.

జీతం ఇప్పట్లో ఎక్కువ చేయనని చెప్పి డైరెక్టర్ వెళ్ళిపోయాడు.

హెడ్డాఫీసుకు ట్రంక్ కాల్ బుక్ చేసి రాజీనామా యిస్తున్నట్లు కార్యదర్శికి తెలియజేశాడు విశ్వం.

—•••—